# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 07-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ధ్యాన శక్తి ద్వారా... బ్రహ్మ కుమారీలు మనస్సు, విశ్వం, స్వీయ సంబంధిత అంశాలపై లోతైన సత్యాలను ఆవిష్కరించారని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు.

- అహ్మదాబాద్ త్వరలో ప్రపంచ క్రీడా పటంలో అగ్రస్థానంలో ఉంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు.

- కృత్రిమ మేధస్సు (AI), మెషిన్ లెర్నింగ్ (ML) ఆధారిత అప్లికేషన్లు తెలివైన, వినియోగదారు-కేంద్రీకృత నెట్‌వర్క్‌లను నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పేర్కొన్నారు.

- జాతీయ గేయం వందేమాతరం 150వ వార్షికోత్సవంపై లోక్‌సభలో రేపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక చర్చను ప్రారంభిస్తారు.

- 7 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాలలో నిర్మించిన 125 వ్యూహాత్మక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = =

ధ్యాన శక్తి ద్వారా... బ్రహ్మ కుమారీలు మనస్సు, విశ్వం, స్వీయ సంబంధిత అంశాలపై లోతైన సత్యాలను ఆవిష్కరించారని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. హర్యానాలోని గురుగ్రామ్‌లో బ్రహ్మ కుమారీల ఓం శాంతి రిట్రీట్ సెంటర్ (ORC) రజతోత్సవ వేడుకలను ఉపరాష్ట్రపతి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వారి నిరంతర ప్రయత్నాలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్వేషకులకు శాంతి, స్వచ్ఛత, ఆధ్యాత్మిక మేల్కొలుపుకు మార్గదర్శనం చేశాయని అన్నారు. సంతృప్తికరమైన జీవనా విధానానికి అవసరమైన వాటిపై మనస్సును కేంద్రీకరించడం ముఖ్యమని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

అహ్మదాబాద్ త్వరలో ప్రపంచ క్రీడా పటంలో అగ్రస్థానంలో ఉంటుందని, 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్య హక్కులను పొందుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ లో పలు అభివృద్ధి పనులు, పట్టణ ప్రజా సౌకర్యాలను అమిత్ షా ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత కొన్ని సంవత్సరాలుగా అహ్మదాబాద్ లో ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలు, శిక్షణా సౌకర్యాల కల్పన జరిగిందన్నారు. 2030 కామన్వెల్త్ క్రీడలకు అహ్మదాబాద్ సిద్ధమవుతోందని అమిత్ షా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (BRO)... 7 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాలలో నిర్మించిన ష్యోక్ టన్నెల్ సహా 125 వ్యూహాత్మక, ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ఢిల్లీ నుండి ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి మాట్లాడుతూ... దేశ భద్రత కోసం కోసం ప్రాణాలను అర్పిస్తున్న సైన్యం, సరిహద్దు రహదారుల సంస్థల సిబ్బంది అత్యున్నత త్యాగాలను గుర్తు చేసుకోవడానికి ఈ ప్రాజెక్టులను అంకితం చేసినట్లు చెప్పారు. లేహ్‌లోని ష్యోక్ టన్నెల్ లడఖ్ తలరాతను మారుస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తుందని మంత్రి రాజనాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

కృత్రిమ మేధస్సు (AI), మెషిన్ లెర్నింగ్ (ML) ఆధారిత అప్లికేషన్లు తెలివైన, వినియోగదారు కేంద్రీకృత నెట్‌వర్క్‌లను నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర విద్యుత్ శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ రంగంలో కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాస సాంకేతికతల వినియోగంపై న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన జాతీయ సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. చురుకైన, విశ్వసనీయమైన, వినియోగదారు-కేంద్రీకృత పంపిణీ వ్యవస్థ వైపు మారడానికి పర్యావరణ వ్యవస్థ భాగస్వాములతో కలిసి పని చేయాలని అన్ని డిస్కంలను కోరారు. AI, ML ఆధారిత పరిష్కారాలు గృహాలు తమ విద్యుత్ వినియోగాన్ని మెరుగ్గా నిర్వహించడానికి ఉపయోగపడతాయని మనోహర్ లాల్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ గేయం వందేమాతరం 150వ వార్షికోత్సవంపై లోక్‌సభలో రేపు ప్రత్యేక చర్చ ప్రారంభమవుతుంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభలో చర్చను ప్రారంభిస్తారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో 8వ తేదీన వందేమాతరంపై చర్చ నిర్వహించి, డిసెంబర్ 9న ఎన్నికల సంస్కరణలపై చర్చ చేపట్టాలని నిర్ణయించినట్లు ఇటీవలే పార్లమెంటు వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

దేశ సైనికులు, అమరవీరులు, వారి కుటుంబాల పట్ల సమిష్టిగా కృతజ్ఞతలు తెలియజేయాలని ప్రజలకు ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కోరారు. ఈరోజు సాయుధ దళాల పతాక దినోత్సవం (Armed Forces Flag Day) సందర్భంగా తన పూర్తి ఒక నెల జీతాన్ని సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళంగా ఇచ్చారు. భారత సాయుధ దళాల క్రమశిక్షణ, సంకల్పం, అజేయ స్ఫూర్తి ప్రజలను

కాపాడుతూ.. దేశాన్ని బలోపేతం చేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అచంచల ధైర్యంతో దేశాన్ని రక్షించే ధైర్యవంతులైన వారికి దేశం తన ప్రగాఢ కృతజ్ఞతలు తెలియజేస్తుందన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలని ప్రధానమంత్రి కోరారు. భారత సాయుధ దళాలు నిస్వార్థ సేవలను అందిస్తున్నాయని, వారి రుణాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ తీర్చుకోలేరని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ భారత సాయుధ దళాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. 1949 నుండి అమరవీరులను, దేశంలోని యూనిఫాంలో ఉన్న వ్యక్తులను గౌరవించడానికి డిసెంబర్ 7వ తేదీని సాయుధ దళాల పతాక దినోత్సవంగా పాటిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రతి రంగం పురోగతిలో అంతర్భాగంగా మారిందని భారత వ్యోమగామి, వైమానిక దళం గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన 'భారతదేశపు మొట్టమొదటి సిటీ సెంట్రిక్ AI ఇన్నోవేషన్ ఇంజిన్' కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... కృత్రిమ మేధ ప్రతి రంగంలో అభివృద్ధికి విస్తృతంగా ఉపయోగపడుతుందని తెలిపారు. వికసిత్ భారత్-2047 కలను సాధించడానికి దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

గోవాలోని అర్పోరాలో ఒక క్లబ్‌లో నిన్న రాత్రి జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 25 మంది మృతి చెందగా, అనేక మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు. గాయపడిన వారు వీలైనంత త్వరగా కోలుకోవాలని నరేంద్రమోదీ ఆకాంక్షించారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి మృతుల కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయలు అందిస్తామని ప్రధానమంత్రి ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్.) రెండవ విడత ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకూ 50 కోట్ల 94 లక్షల మందికి పైగా ఓటర్లకు గణన ఫారాలను పంపిణీ చేసినట్లు ఎన్నికల సంఘం ఈ రోజు తెలిపింది. ఈ విడతలో దాదాపు 51 కోట్ల మంది ఓటర్లలో 99.94 శాతం మందిని చేరినట్లు, ఇప్పటివరకు 50 కోట్లకు పైగా ఫారాలను డిజిటలైజ్ చేసినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్, హర్యానా, పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశాలలో రేపటి వరకు చలిగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్‌లలో రాబోయే రెండు రోజుల పాటు దట్టమైన పొగమంచు పరిస్థితులు ఉంటాయని తెలిపింది. అండమాన్ నికోబార్ దీవులు, తమిళనాడు, పుదుచ్చేరి కారైకల్‌లలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ విమానయాన సంస్థలు సజావుగా పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నాయని, ఇండిగో విమానయాన సంస్థ పని తీరులో స్థిరమైన మెరుగుదల కనిపిస్తోందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. విమాన షెడ్యూల్స్ సాధారణ స్థాయికి తిరిగి వస్తున్నాయని, దేశవ్యాప్తంగా విమాన ప్రయాణ

కార్యకలాపాలు వేగంగా స్థిరీకరించబడుతున్నాయని పేర్కొంది. ధరల పెరుగుదలను నివారించడానికి అన్ని విమానయాన సంస్థలకు తక్షణమే విమాన ఛార్జీలపై పరిమితిని ప్రవేశపెట్టారు.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =